మానవుడా? దానవుడా?

అజీజ్

"జైల్లో రెండేళ్ళనించీ తాగిన బీడిముక్కలే తాగి నోరు పాడైపోయింది. ఓ సిగరెట్ వుంటే పడెయ్యండి!" అన్నాడు షణ్ముగం జైలు గేటు దగ్గర కాపలా కాస్తున్న గార్డుని.

"ఈరోజు విడుదలయ్యేవుగా? తట్టెడు కొనుక్కొని తాగు!" అన్నాడు గార్డు నవ్వుతూ.

"తట్టెడు మాట దేవుడెరుగు. ఒక్క సిగరెట్ కొనుక్కోడానికి దమ్మిడీ ఉంటేగా జేబులో! ఇంటికెళ్ళి పెళ్ళాన్నడిగి తేగానీ పదిపైసలు పుట్టే యోగం లేదిప్పుడు మా ఇల్లు కోడంబాకంలో వుంది. ఇక్కణ్నించి కాలి నడకన అక్కడికి చేరేసరికి చీకటిపడుతుంది.

కారు ముందుకు సాగాలంటే పెట్రోల్ ఎంత అవసరమో నాలో ఊపిరి ఆడాలంటే సిగరెట్ అంత అవసరం. రెండేళ్ళు మీ జైల్లో ఎన్ని అవస్థలు పడ్డానో ఆ పరంధాముడికే తెలుసు!'' అన్నాడు షణ్ముగం.

గార్డుకి అతనిమీద జాలేసినట్టుంది. కుడిచేతిలో వున్న రైఫిల్ ఎడం చేతిలోకి మార్చుకుని జేబులోంచి సిగరెట్ పాకెట్, అగ్గిపెట్టె తీసి, ఓ సిగరెట్ అందించేడు.

షణ్ముగం సిగరెట్ అంటించుకుని—''థాంక్స్, బస్తా!'' అంటూ కదలబోయేడు.

''మళ్ళీ వస్తావా? జైలుకి?'' అన్నాడు గార్డు.

షణ్ముగం నవ్వి—''నోరు జారింది! వెళ్ళదా!'' అంటూ గబ గబ ముందుకు అడుగులు వేసేడు.

షణ్ముగానికి ముప్పై ఐదేళ్ళుంటాయ్. నల్లగా, పొట్టిగా, గున్న ఏనుగలా వుంటాడు మనిషి. పిసరంత బొజ్జ. కండలు తిరిగిన ఒళ్ళు. గుడ్లగూబలాంటి కళ్ళు. పీచు తల.

మాసి ముడతలుపడ్డ నల్ల కాటన్ పాంటూ, గళ్ళ షర్టూ వేసుకున్నాడు. మెడలో మఫ్లర్!

సిగరెట్ దమ్ములాగుతూ తల వంచుకుని గబ గబ నడుస్తున్నాడు.

ఆ సెంట్రల్ జైలు ఏరియానించి సిటీలోకి వెళ్ళాలంటే ఓ అరమైలు దూరం నిర్మానుష్యమైన ఆ రోడ్డమ్మట నడవాలి. అప్పటికే పరిసరాలవి చీకట్లు ముసురుకుంటున్నాయి. రోడ్డు కిరుపక్కలా వున్న ఎలక్ట్రిక్ దీపాలు అప్పుడే వెలిగేయి.

వెనక ఏదో కారు తననే సమీపిస్తున్నట్టు చప్పుడు విని చటుక్కున ఆగేడు షణ్ముగం. సందేహ నివృత్తి కోసం ఇంకా వెనక్కి తిరిగి చూడకముందే ఓ బ్లూరంగు ఫియట్ కారు వచ్చి అతని పక్కన ఆగింది!

షణ్ముగం కళ్ళు చిట్లిస్తూ కార్లోకి చూసేడు.

స్టీరింగ్ ముందు ఒకేఒక వ్యక్తి కూర్చునున్నాడు. డార్క్ ఆష్ కలర్ లాంగ్ కోట్, అదేరంగు ఫెల్ట్ హాట్. మెడలో చెవులవరకూ ఎత్తుగా చుట్టుకున్న మఫ్లర్.

పరిసరాలని చిరు చీకట్లు కమ్ముకోడంవల్లా, ఆ వ్యక్తి తలమీది ఫెల్ట్ హాట్ ని బాగా ముందుకి లాక్కుని పెట్టుకోడంవల్లా షణ్ముగానికి అతని మొహం స్పష్టంగా కనిపించడంలేదు.

"లిఫ్ట్ కావాలా?" అడిగేడతను కీచుకంఠంతో.

షణ్ముగంకు ఆశ్చర్యం వేసింది. కారణం, దారిన పోయే దానయ్యలకి, కారాపి లిఫ్ట్ ఇచ్చే పెద్దమని షెవ్వడూ ఇంతవరకూ తటస్థపడలేదతనికి! అదీ, ఈ జిడ్డోడే దుస్తుల్లో ఉన్న తనవంటి దేభ్యంగాడికి లిఫ్ట్ ఇవ్వాలనుకునే పెద్దమనిషి ఈ లోకంలో వుండటం వింతలోకి వింత!

"ఏమిటి ఆలోచిస్తావ్? రా, కూర్చో!" అన్నాడతను మరోసారి. షణ్ముగం తేరుకుని, దొరికిన ఛాన్సు దేనికి వదులుకోవాలని బాక్ డోర్ తెరిచి లోన కూర్చున్నాడు.

"ఎక్కడికెళ్ళాలి?" అడిగేడతను వెనుదిరిగి చూడకుండా.

"కోడంబాకం!"

కారు కదిలింది.

షణ్ముగం ఇంకా పూర్తిగా ఆశ్చర్యంలోంచి తేరు కోలేక పోతున్నాడు.

చూస్తూ, చూస్తూనే కోడంబాకం వచ్చేసింది. వీధి మలుపులో రోడ్డు పక్క కారాపేడతను. అప్పటికే బాగా చీకటి పడింది.

కార్లో ఇప్పుడా వ్యక్తి ఆకారం తప్ప మరేమీ కని పించడంలేదు.

"నీ ఇల్లు ఎక్కడుంది?" అడిగేడతను వెనుదిరిగి.

"అదుగో, ఆ సందులో పడి ఫర్లాంగు నడిస్తే వస్తుంది!"

"పెళ్ళాం, పిల్లలూ వున్నారా?"

"పిల్లలేరు! నాలాటి వాళ్ళకి పుస్తెకట్టిన పెళ్ళాలు కూడానా? ఉంచుకున్న బాపతు... నేను జైలుకెళ్ళాక అదింకా ఆ ఇంట్లోనే వుందో, ఎవ్వడితోనైనా ఎగిరి పోయిందో తెలీదు!"

"నీతో చాలా ముఖ్యమైన పనుంది నాకు!"

"తెల్సు! ముందే అనుమానించేను. లేకుంటే, దారిన పోయేవాడికి లిఫ్ట్ ఇవ్వడం ఏమిటి?"

"నిజమే! ఈరోజు జైల్లోంచి ఎవ్వడు విడుదలవుతాడా అని మధ్యాహ్నంనించీ పడిగాపులు గాస్తున్నాను జైలు పరిసరాల్లో. ఇప్పటికి నువ్వు బైటపడ్డావ్!"

"ఇంతకీ, నాతో ఏమిటి పని?" అడిగేడు షణ్ముగం అసలు విషయానికి వస్తూ.

"ఎక్కడైనా తీరిగ్గా కూర్చుని మాట్లాడే విషయం

అది...బాగా డబ్బు ముడుతుంది నీకు!" అతను చాలా నెమ్మదిగా మాట్లాడుతున్నాడు. కంఠం కీచుగా వుంది.

"నా జీవితంలో సగభాగం నేరాల్లో గడిచి పోయింది. రెండేళ్ళు శిక్ష అనుభవించి ఇప్పుడే బైట పడ్డాను. చేతిలో చిల్లి కానీ లేదు. జైల్లో పూటకింత కూడైనా దొరికేది. ఇక్కడ చేతిలో డబ్బులేందే మంచి నీళ్ళుకూడా దొరకవు. న్యాయంగా సంపాదిస్తే నాలుగు వేళ్ళుకూడా నోట్లోకి వెళ్ళవు. కనక, నువ్వేం చెప్పినా చెయ్యడానికి నేను సిద్ధం!" అన్నాడు షణ్ముగం దృఢంగా.

"గుడ్! అందుకే నీలాంటివాళ్ళకోసం నేను గాలించేది. పద, వివరంగా మాట్లాడుకుందాం" అంటూ కారు పోనిచ్చేడతను.

రెండుమూడు రోడ్లు దాటి మాప్పిళ్ళై స్ట్రీట్‌లోకి తిరిగింది కారు. ఆ వీధిలో ఓ చిన్నసైజు మేడముందు ఆపేడతను. ఇంటిచుట్టూ చిన్న కాంపౌండ్. ఇనప ఊచల గేటు.

"కారు లోనికి తీసుకెళ్ళాలి. కాస్త ఆ గేటు తెరువ్!" అన్నాడతను.

షణ్ముగం దిగి గేటు తెరిచేడు.

అతను కారు కాంపౌండ్‌లోనికి పోనిచ్చి, కుడివైపు కట్టివున్న గేరేజ్‌లో ఆపి దిగేడు. ఇంటికి తాళం వేసి వుంది.

అతను తాళం తెరిచి—"రా!" అన్నాడు.

హాల్లో డిమ్‌లైటు వెలుగుతోంది. కుడివైపు గోడ

వారగా పైకెళ్ళడానికి మెట్లున్నాయి. అతను తలుపు మూసి మెట్లవైపు నడిచేడు. అలవాటు ప్రకారం అక్కడి వస్తువుల్ని ఎక్స్‌రే కళ్ళతో పరిశీలిస్తూ అతన్ని అనుసరించేడు షణ్ముగం!

ఇద్దరూ మెట్లెక్కి పైకి చేరుకున్నారు. పైన రెండు గదులున్నాయి. అతను ఓ గది తలుపు తెరిచి లోన అడుగుపెట్టేడు. అందులో మరీ తక్కువ వోల్టేజ్ బల్బు వెలుగుతోంది. అంతసేపూ ఆ వ్యక్తి మొహం ఒక్కసారి చూడాలనుకుంటున్న షణ్ముగం నిరుత్సాహపడ్డాడు. ఆ వెలుగులో ఒకరి మొహాలొకరు స్పష్టంగా చూసుకోడం కష్టం!

షణ్ముగాన్ని సోఫాలో కూర్చోమన్నట్టు సైగచేస్తూ' కాస్త ఎడంగా వున్న సోఫాలో చితికిలబడ్డాడతను.

"ఇప్పుడు చెప్పు. ఏమిటి సంగతి?" అడిగేడు షణ్ముగం కూర్చుంటూ.

"పాండీబజార్‌లో వున్న మెటెర్నిటీ హోమ్ ఎప్పుడైనా చూసేవా?"

"మెటెర్నిటీ హోమ్ అంటే?"

"ప్రసూతి గృహం! ఆడవాళ్ళు పిల్లల్ని కంటారే, అది!"

"చూశాను!"

"ఈరాత్రి అందులోంచి ఓ పిల్లవాణ్ని ఎత్తుకురావాలి!"

షణ్ముగం పకపక నవ్వి "ఈ పనికేనా నన్నిక్కడికి తెచ్చింది?" అన్నాడు.

"ఔను! దేనికలా నవ్వుతావ్?"

"ఇంత ఇదిగా నన్నిక్కడికి తీసుకొచ్చావంటే, ఎవ్వరినైనా సఫా చెయ్యమనో, ఏ అందమైన అమ్మాయి నైనా కిడ్నాప్ చేసి తీసుకురమ్మనో అంటావనుకున్నాను! చాలా చిన్నపని చెప్పావ్!"

"దీనికే వెయ్యిరూపాయలు ముడతాయి నీకు!"

"ఆ హాస్పిటల్లో రోజూ అనేకమంది పిల్లల్ని కంటూంటారు. అందులో ఏ పిల్లాణ్ని ఎత్తుకురావాలి?"

"ఏ పిల్లాడైనాసరే! ఎర్రగా, బొద్దుగా, ఆరోగ్యంగా వుండాలి!"

"అంత_పెంపకం తీసుకోవాలనుకుంటే, అనాథ శరణాలయాల్లో దిక్కు మొక్కు లేక ఎందరో పిల్లలున్నారుగా?"

ఆ మాట అతనికి నచ్చనట్టుంది. "నీకు డబ్బుకావాలా, వద్దా? అనవసరంగా కాలయాపన చెయ్యక! ఇప్పుడు సరిగ్గా పది గంటలవుతున్నాయి. సిటీలో జనసంచారం సన్నగిల్లుతుంది. మంచి సమయం వెళ్ళు!" అన్నాడు.

"ఆల్ రైట్! వెళ్ళడానికి నాకేం అభ్యంతరంలేదు. ఖర్చులకు కొంత డబ్బిలాపడేయ్!" అన్నాడు షణ్ముగం లేస్తూ.

అతను జేబులోంచి పర్సుతీసి, మూడు వంద రూపాయల నోట్లు లాగి, టీపాయ్‌మీదికి విసిరేడు.

షణ్ముగం వాటిని అందుకుని జేబులో కుక్కుతూ "వస్తాను! ఎదురుచూస్తుండు" అని బైటికి నడిచేడు.

2

అదే మెటర్నిటీ హోమ్!

వీధిలో మనిషిమాత్రుడు లేడు. మెయిన్ గేటు మూసి ఉంది.

కాంపౌండ్ పిట్టగేటు దూకి లోనికి వెళ్ళడం పెద్ద సమస్యకాదు. మెడలోని మఫ్లర్ బిగదీసుకుంటూ ఓసారి అటూ ఇటూ చూసి గోడని సమీపించేడు షణ్ముగం.

కన్ను మూసి తెరిచేలోగా ఎగిరి అవతలకి దూకేడు. కాంపౌండ్‌లో మసక చీకటి. హాస్పిటల్ సింహద్వారం ముందున్న వరండా ఇనప వలగేటు మూసి ఉంది. వరండాలో ఉన్న బల్బు గుడ్డిగా వెలుగుతూ కునికిపాట్లు పడుతోంది.

అది రెండంతస్తుల భవనం. పై అంతస్తులో డిమ్ లైట్లు వెలుగుతున్నాయి. వాటర్ పైప్ అందుకుని సులభంగా పైకి జేరుకోవచ్చు. గబ గబ నీటిగొట్టంవైపు నడిచేడు.

వేడికోసం కాసేపు అరచేతులు రుద్దుకొని గొట్టం అందుకున్నాడు. కన్నుమూసి తెరిచేలోగా పై కెగబాకి తెరిచి ఉన్న కిటికీ అంచు అందుకున్నాడు. కాసేపు అంచుపట్టుకుని వేళ్ళాడి, శరీరంలో స్ప్రింగ్ యాక్షన్ ఏర్పడ్డాక ఎగిరి కిటికీమధ్య కూర్చున్నాడు. గుండెలో సన్నగా దడ ప్రారంభమయింది.

గదిలోకి చూసేడు. ఖాళీ! మనిషి ఛాయలేదు. ఆ గదిలో ఎవ్వరో ఒక పేషెంట్ వుంటుందనుకున్న షణ్ముగం నిరుత్సాహపడ్డాడు.

సాలోచనగా తలూపుతూ, కిటికీ దిగి దగ్గరగా వేసి ఉన్న తలుపులవైపు నడిచేడు. సందుమధ్య కన్ను పెట్టి నడవాలోకి చూసేడు, ఎవ్వరైనా తిరుగుతున్నారేమోనని. ఎవ్వరూ లేరు!

ఆగి ఆగి పేషెంట్ల దగ్గులూ, పసిగందుల కేరింతలూ

వినిపిస్తున్నాయి. తలుపుమీద చెయ్యివేసి మెల్లిగా ఓ రెక్క తెరిచేడు. అంతే! నడవాలో ఎవ్వరో వస్తున్న అడుగుల ధ్వని. షణ్ముగం గుండె గుభిల్లుమంది.

చటుక్కున రెక్కమూసి, వెంట్రుకవాసి సందులోంచి నడవాలోకి చూసేడు. ట్రేలో దూదీ, మందు సీసాలూ పట్టుకుని వెళుతోంది ఓ నర్సు!

ఊపిరి బిగబట్టి నిల్చున్నాడు. ఆమె నడవా దాటి, మెట్లు దిగి కిందికెళ్తున్న శబ్దం క్రమంగా దూరమైంది.

మెల్లిగా తలుపు తెరిచి నడవాలోకి అటూ ఇటూ తొంగిచూసేడు. ఎవ్వరూ లేరు. తేలికపడ్డ మనసుతో బైట అడుగుపెట్టేడు.

అంతే! కెవ్వుమన్న స్త్రీ కంఠం వినగానే షణ్ముగం గుండె లవుసిపోయేయి. చెవులు రిక్కించేడు. కింద యెక్కడో బాధగా అరుస్తున్న స్త్రీ కంఠం అది.

చిన్నగా నవ్వుకున్నాడు. అది ప్రసూతి గృహం! కింద ఎవ్వరో ప్రసవవేదనపడుతున్నట్లున్నారు, అందుకే, ఇంత క్రితం ఆ నర్సు మందులూ మాకులూ తీసుకెళ్ళింది.

అడుగులో అడుగు వేసుకుంటూ పక్క గదివైపు నడిచేడు. తలుపుదగ్గిర ఆగి మునివేళ్ళతో తోసేడు. తెరుచుకుంది. గదిలోకి తొంగిచూసేడు. మంచంమీద తల్లీ, ఉయ్యాలలో కుర్రాడూ మంచి నిదరలో ఉన్నారు.

లోన అడుగుపెట్టి, తలుపుమూసి వెనుదిరిగేడు. అడుగులో అడుగు వేసుకుంటూ ఉయ్యాలని సమీపించేడు. పడుకున్న పసివాణ్ణి మెల్లిగా చేతుల్లోకి ఎత్తుకున్నాడు. వాడికి చుట్టబెట్టివున్న బట్టలు తీసి, భుజంమీదుగా ఛాతీకి కట్టుకుని వాణ్ణంగులో పడుకోబెట్టుకున్నాడు.

ఆలస్యం చేస్తే కొంప మునగవచ్చు. పిల్లి అడుగులు వేస్తూ తలుపు వైపు నడిచేడు. సరిగ్గా అప్పుడే గుడ్డలో ఉన్న కుర్రాడు అటూ ఇటూ కదిలినట్టు తోచింది. శబ్దం కానివ్వకుండా తలుపు తెరిచేడు. అంతే!

కుర్రాడు గుక్క తిప్పుకోకుండా రాగం మొదలు పెట్టేడు. వెనక, మంచం కిర్రుమన్న చప్పుడు! వాడి తల్లి నిదర లేచి ఉంటుంది!! దడదడమంటున్న గుండెతో నడవాలోకి గెంతేడు.

గదిలో అరుపులు—"దొంగ! దొంగ, నా బాబు నెత్తుకుపోతున్నాడు. పట్టుకోండి. రక్షించండి."

కుర్రాడి ఏడుపు అంతకంతకీ ఎక్కువవుతోంది. షణ్ముగానికి ముచ్చెమటలు పడుతున్నాయి. మెరుపులా పక్క గదిలోకి దూరేడు. కిందినించి కొందరు పైకి పరిగెత్తుకొస్తున్నట్టు మెట్లమీద చప్పుడు వినిపించసాగింది. కన్ను మూసి తెరిచేలోగా కిటికీని సమీపించేడు షణ్ముగం. కిటికీ ఎక్కి జాగ్రత్తగా సీటిగొట్టం అందుకున్నాడు. కాళ్ళు వణుకుతున్నాయి. చమటవల్ల పట్టు జారితే అంత ఎత్తునించి కిందపడి కుర్రాడితో బాటు తనూ గోవిందా!

మొదటిసారి ఏడుకొండలవాడికి మొక్కుకుంటూ జర జర కిందికి జారేడు. గుక్క తిప్పుకోకుండా ఏడుస్తున్నాడు కుర్రాడు. అదృష్టం బావుంది. చివరికి నేలమీద అడుగుపెట్టేడు.

క్షణం వేస్టు చెయ్యకుండా కాంపౌండు పిట్టగోడ వైపు పరుగుతీసేడు. రెప్పపాటులో ఎగిరి బైటికి దూకేడు. కొద్ది దూరంలో రోడ్డుపక్క ఆపి ఉంది ఫియట్ కారు.

బాణంలా అక్కడికి చేరుకున్నాడు.

ఫ్రంట్ డోర్ తెరిచి, కట్టుకున్న బట్టవిప్పి కుర్రాణ్ణి సీట్లోకి విసిరేశాడు. స్టీరింగ్ ముందు కూర్చుని కారు స్టార్టు చేసి వేగంగా ముందుకు పోనిచ్చేడు.

3

"క్రైంబ్రాంచికి ఫోన్ చెయ్యండి!" అన్నా రెవరో.

లేడీ డాక్టర్ తన ఆఫీస్ గదిలోంచి ఫోన్ చేసింది.

ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి, సార్జంట్ డేవిడ్, కొంత సిబ్బంది హుటాహుటిన వచ్చేరక్కడికి.

లేడీడాక్టర్ జరిగిందంతా ఇన్‌స్పెక్టర్‌కు చెప్పింది.

"ఆ పాప తల్లి ఎక్కడుందిప్పుడు?"

"పై అంతస్తులో స్పృహతప్పి పడుంది!"

అందరూ పైకి వెళ్ళి ఆ గదిలో అడుగుపెట్టేరు.

అంతక్రితమే స్పృహ రావడానికి ఇంజక్షన్ ఇచ్చారు గనక ఆమె కళ్ళు తెరిచి పిచ్చి పిచ్చిగా చూస్తోంది.

"దొంగ! నా బాబు నెత్తుకుపోతున్నాడు. పట్టు కోండి. నా బాబును రక్షించండి" ఇంకా ఆ షాక్ నుంచి తేరుకోనట్టుంది. పలవరిస్తోంది.

"మీరు ఆ వ్యక్తిని చూశారా?" అడిగేడు ఇన్‌స్పెక్టర్ ఆమెవైపు చూస్తూ.

ఆమె రాజారెడ్డివైపు కళ్ళుతిప్పింది. యూనిఫాంలో ఉండడం మూలాన అతను పోలీస్ ఆఫీసర్ అని గ్రహించింది. అక్కడికి పోలీసులు వచ్చేశారని తెలుసుకుంది.

కాస్త ధైర్యం వచ్చింది కాబోలు. "చూశాను" అంది.

"ఎలా ఉంటాడు?"

"తలుపువైపు పోతుండగా చూసేను. పొట్టిగా, లావుగా ఉంది ఆకారం. పీచుతల. మెడలో మఫ్లర్. నా బాబును బట్టలో పడుకోబెట్టి భుజం మీదుగా కట్టుకున్నాడు..."

"మీ అరుపులువిని కూడా అతను వెనక్కి తిరిగి చూడలేదా?"

"లేదు. వెంటనే తలుపు తెరుచుకుని బైటికి వురికేడు."

"మీ వారి ఉద్యోగం ఏమిటి?"

"ఫిలిం రిప్రజెంటేటివ్!"

"మీ బాబుని అపహరించడంవల్ల మీ బంధువుల్లో ఎవ్వరికైనా ఏదైనా లాభం ఉందా? ఆలోచించి చెప్పండి!"

"లేదు!"

"మీరు ఆందోళనపడి ఆరోగ్యం పాడుచేసుకోవద్దు. మీ బాబుని ఉదయంలోగా ఎక్కడున్నాసరే వెదికి మీ కప్పగిస్తాము" అంటూ లేచాడు ఇన్‌స్పెక్టర్.

4

"డాక్టర్!" పిల్చింది నర్స్.

వార్డులో రౌండ్ కెళ్ళబోతున్న లేడీ డాక్టర్ ఆగి, ప్రశ్నార్థకంగా చూసింది.

"మీకు ఓ పార్సిల్ వచ్చింది. సంతకం చేసి తీసుకోడానికి రమ్మంటున్నాడు పోస్ట్‌మెన్!"

డాక్టర్ కనుబొమలు ముడివడ్డాయి. హాస్పిటల్‌కి రోజూ పోస్టురావడం మామూలు. కొత్త కొత్త మందుల ఎడ్వర్‌టైజ్‌మెంట్స్ వస్తుంటాయి, బుక్‌పోస్టుల్లో.

కాని, డాక్టర్ పేర పార్సిల్ రావడమేమిటి?

"పార్సిలా?" అంది సందేహంగా.

"ఔను! చిన్న చెక్క పెట్టి!" అంది నర్స్.

"అతన్ని ఇక్కడికే రమ్మను!"

రెండు నిమిషాల తర్వాత చేతిలో చిన్న చెక్క పెట్టి పట్టుకుని, లోనికి వచ్చేడు పోస్ట్‌మెన్.

డాక్టర్ సంతకం చేసి దాన్ని తీసుకుంది.

బరువుగా ఉంది! దాదాపు గజం పొడవు పెట్టి. చిన్న చిన్న మేకులు కొట్టి సీలు వేయబడుంది. బల్ల మీది పెన్సిల్ చెక్కే చాకు అందుకుని నర్సుకిస్తూ, మూత ఊడదీయ మన్నట్టు సైగ చేసింది డాక్టర్.

నర్సు మూత ఊడదీసి గావుకేక పెట్టింది!

డాక్టర్ రాతిబొమ్మలా గుడ్లు తేలవేసి పెట్టెలోకి చూస్తూండిపోయింది.

పెట్టెలో వెల్లికితలా పడుకో బెట్టి వుంది శవం! తెల్లని పసికందు శవం!! కళ్ళు సగం మూతలు పడున్నాయి. నోరు కొద్దిగా తెరిచివుంది. కంఠం దగ్గరా, చేతి మణికట్ల దగ్గరా, లోతైన కత్తిగాట్లు.

అప్పుడు పడింది డాక్టర్ దృష్టి, ఓ మూల మడత పెట్టి ఉన్న కాగితం మీద. వణికే చేత్తో దాన్ని అందుకుని విప్పి చూసింది. తెలుగులో గజిబిజిగా రాసిన అక్షరాలు.

"డియర్ డాక్టర్!

రాత్రి మీ హాస్పిటల్లో ఓ కుర్రాడు మాయమయ్యేడు. వాడి శవాన్ని పెట్టిలో పెట్టి పార్సిల్ జేస్తున్నాను. దయ చేసి ఈ శవాన్ని వాడి తలిదండ్రుల కప్పచెప్పండి.

ఈశ్వరుని ఆజ్ఞ లేనిదే చీమైనా చావదంటారు. వీడికి

ఈశ్వరాజ్ఞ అయింది. వెళ్ళిపోయేడు. చింతించి ప్రయోజనం! కంటికి కనిపించని ఓ సూక్ష్మజీవి ఇలా మానవాకృతి దాలుస్తుంది. కొన్నాళ్ళు జీవించి, తరవాత మరణిస్తుంది. అంతే!"

డాక్టర్ తల గిరగిర తిరుగుతోంది.

ఉత్తరం మడిచి, టేబిల్ మీది టెలిఫోన్ ముందుకు లాక్కుంది.

"ఎస్, ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి స్పీకింగ్!"

"ఇటీజ్ మెటెర్నిటీ హాస్పిటల్!"

"మళ్ళీ ఏం జరిగింది?" ఇన్‌స్పెక్టర్ కంఠంలో ఆతృత.

"ఘోరం జరిగిపోయింది ఇన్‌స్పెక్టర్! ఫోన్‌లో చెప్పే ఓపిక ఇప్పుడు నాలో లేదు. తల తిరుగుతోంది. మీరు తక్షణం బైలుదేరండి" అంటూ రిసీవర్ క్రెడిల్ చేసింది డాక్టర్.

ఇన్‌స్పెక్టర్ నిమిషాల్లో వచ్చాడక్కడికి.

పెట్టెలోని పసికందు శవం చూడగానే స్థాణువై పోయేడు.

ఆ ఉత్తరం విప్పి అందించింది డాక్టర్.

ఉత్తరం చదివి, కాసేపు శవాన్ని పరీక్షగా చూసిన ఇన్‌స్పెక్టర్ బుర్రలో తళుక్కుమంది ఓ ఆలోచన.

"డాక్టర్! పసివాణ్ని చంపదలుచుకున్న వాళ్ళు, కత్తితో కేవలం కంఠం దగ్గర కోస్తే చాలు, చేతి మణికట్టుకూడా కొయ్యడం జరిగింది. దీని అర్థం ఏమిటి?"

"ఆలోచించాలి! బాగా ఆలోచిస్తేగానీ ఈ ప్రశ్నకి జవాబు దొరికేలా లేదు. ఇప్పుడు నాలో ఆలోచించే శక్తి పూర్తిగా నశించింది."

"అంతేకాదు, శవం పూర్తిగా తెల్లగా పాలిపోయి ఉంది. ఇదికూడా గమనించతగ్గ విషయమే!"

"ఔను!"

సాలోచనగా తలూపి—"దయచేసి ఈ ఘోర వార్తను పిల్లాడి తలిదండ్రులకి చెప్పకండి," అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"మీరు ప్రత్యేకంగా చెప్పనవసరంలేదు. నాకు తెలుసు. ఈ విషయం వింటే, ఆ భార్యాభర్తలిద్దరూ పిచ్చివాళ్ళవుతారు. ఈ రహస్యం మనలోనే గుప్తంగా వుండాలి. కాని, ఈ కసాయిపని చేసిన ఆ కిరాతకుణ్ని మాత్రం మీరు పట్టుకునితీరాలి" అంది డాక్టర్ ఆవేశంగా.

"పట్టుకోడం కాదు డాక్టర్! వాడ్ని ఉరికంబం ఎక్కించేవరకూ నేను నిదరబోను!" పళ్ళు పటపట కొరికేడు ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి.

5

"ఈ రాత్రి ఇంకో కుర్రాణ్ని మాయంచేసి తీసుకు రావాలి!" అన్నాడతను కీచు కంఠంతో.

మసక చీకట్లో అతని మొహం చూడ్డానికి ప్రయత్నిస్తూ—"ఇంతకీ, ఈ పసికుర్రాళ్ళని ఏం చేస్తావ్!" అడిగేడు షణ్ముగం.

ఆ ప్రశ్న అతనికి నచ్చనట్టుంది. సోఫాలో ఇబ్బందిగా కదిలి—"అది నీ కనవసరం! డబ్బు కావాలనుకుంటే ఒప్పుకో. లేదా, మానెయ్!" అన్నాడు.

"డబ్బు ఎవడికి చేదు? మళ్ళీ హాస్పిటల్లోనా?"

"ఇక హాస్పిటల్లో వద్దు! పోలీస్ కాపలా ఏర్పాటయ్యుంటుంది. చాలా ప్రమాదం!"

"మరి?"

"కురుప్పన్ వీధి. ఇంటి నెంబర్ నూటపదహారు. బాగా జ్ఞాపకం పెట్టుకో. ఆ ఇంట్లో ఐదు రోజులక్రితం ఓ పిల్లాడు పుట్టేడు. చాలా జాగ్రత్తగా తీసుకురావాలి!"

"సరే, సగం డబ్బు ఇలా అడ్వాంసుగా పడెయ్!" అంటూ లేచాడు షణ్ముగం.

అతను పర్సు తీసి, ఐదు నోట్లు లెక్కపెట్టి టీపాయ్ మీదికి విసిరేడు. వాటినందుకుని హిప్ పాకెట్లో కుక్కుతూ బైటికి నడిచేడు షణ్ముగం.

6

అదే కురుప్పన్ వీధి!

వీధి మొదట్లో కారాపి దిగేడు షణ్ముగం. మెడలోని మఫ్లర్ బిగదీసుకుంటూ చుట్టూ చూసేడు. అది సెకెండ్ షో టైం గనక వీధిలో మనిషి మాత్రుడు లేడు. పెంట కుప్పల్లో పడుకుని చలికి తెగ ఏడుస్తున్నాయి ఊర కుక్కలు.

చక చక ఇంటి నెంబర్లు చెక్ చేసుకుంటూ వీధిలో నడవసాగేడు. కొద్దిదూరం వెళ్ళాక కనిపించింది నూట పదహారో ఇల్లు. తలుపులు మూసివున్నాయి. పక్కనే ఇనప ఊచల కిటికీ.

అరుగు ఎక్కి కిటికీగుండా లోనికి చూసేడు. టేబిల్ మీద లాంతర్ వెలుగుతోంది. పడుకునే సమయం గనక, వత్తి బాగా తగ్గించి ఉంచేరు. ఓ గోడవారగా నులక మంచం. ఆ మంచంమీద ఓ యువకుడు పడుకుని గుర్రు కొడుతున్నాడు.

బహుశా, పుట్టిన కుర్రాడి తండ్రయుంటాడు. పాపం.

దురదృష్టవంతుడు. కిటికీ దగ్గర్నించి కదిలి తలుపు ముందుకి వచ్చేడు షణ్ముగం. మునివేళ్ళతో మెల్లగా తట్టేడు తలుపుని.

ఐదు నిమిషాలు గడిచినా ఎవ్వరూ వస్తున్న అలికిడి లేదు. మళ్ళీ తట్టేడు. మరో ఐదు నిముషాలు గడిచేయి. విసుగు పుడుతోంది షణ్ముగానికి. ఈమారు దబ దబ తట్టేడు. గురక ఆగిపోయింది.

"ఎవ్వరు?" మంచంమీద లేచి కూర్చున్న చప్పుడు.

"సి. ఐ. డి. ఇన్‌స్పెక్టర్ని!"

"ఆఁ!"

"సి. ఐ. డి. ఇన్‌స్పెక్టర్ని."

మంచం దిగి గబగబ తలుపువైపు వస్తున్న అడుగుల శబ్దం.

తలుపు తెరుచుకుంది. "ఎవ్వరు?" మసక చీకట్లో షణ్ముగాన్ని పరీక్షగా చూట్టానికి ప్రయత్నిస్తున్నాడతను.

"నేను సి. ఐ. డి. ఇన్‌స్పెక్టర్నండి! ఓ చోరీ కేసు ఇన్వెష్టిగేషన్ చేస్తున్నాను. దొంగ ఈ వీధిలోనే వున్నట్టు వివరాలు అందేయి!"

"ఈ వీధిలో వున్నాడా?"

"యస్! మీ ఇంటివెనక వుంది చూడండి ఇల్లు. దాంట్లో."

"ఏమిటీ? మా ఇంటి వెనక ఇంట్లో వుంటున్న ముకుందరావు దొంగా! చాలా మంచివాడులా కనిపిస్తాడే!"

"దొంగ వెధవలు అలాగే కనిపిస్తారండి! అర్ధ రాత్రి మీ నిద్ర చెడగొట్టి శ్రమ ఇస్తున్నాను. అతనిగురించి రెండు మూడు ప్రశ్నలడిగి వెళ్ళిపోతానంతే!"

"ఇందులో శ్రమేముందండీ! అటువంటి దొంగ రాస్కెళ్ళని పట్టివ్వడంలో పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు సాయపడటం మా ధర్మం. బైట చలిగా వుంది. రండి లోన కూర్చుని మాట్లాడుకుందాం!" అంటూ తలుపుకడ్డం తొలగేడతను.

ఆ అవకాశం కోసమే ఎదురుచూస్తున్న షణ్ముగం తెచ్చిపెట్టుకున్న హుందాతో లోపల అడుగుపెట్టేడు.

"కూర్చోండి!" అంటూ టేబుల్ కెదురుగా వున్న కుర్చీ చూపించేడతను.

షణ్ముగం మెరుపులా ముందుకుదూకి అరచేతి అంచుతో ఒక్కటి ఇచ్చేడు అతని మెడమీద. అతనా షాక్‌లోంచి తేరుకోకముందే మరో రెండు మెరుపు దెబ్బలు తీసేడు వరసగా.

ఊహించని ఆ దాడికి అతను తట్టుకోలేక, ఉన్న పళంగా నేలకూలేడు. అతనికి స్పృహ తప్పిందనిబాగా నిర్ధారించుకున్నాక, చమట తుడుచుకుంటూ పక్కకి తిరిగేడు షణ్ముగం.

ఆ గది పడివైపు మరో గది వుంది. తలుపులు దగ్గరగా వేసివున్నాయి. తలుపుముందాగి, సందులోంచి చూసేడు లోనికి.

దీపం వెలుగుతోంది. మంచంమీద తల్లీ కుర్రాడూ మంచి నిదరలో ఉన్నారు. కింద చాప పరుచుకుని ఓ ముసలమ్మ పడుకునుంది. ముగ్గురూ గాఢ నిదరలో ఉన్నారు.

మునివేళ్ళతో తలుపుతోసి లోన అడుగుపెట్టేడు. సవ్వడి కానివ్వకుండా మంచందగ్గరికి నడిచి ఆగేడు. జేబులోంచి చిన్నసీసా బైటికి తీసేడు. మూత తెరిచి లోపల ఉన్న ద్రవాన్ని వేళ్ళమీద పులుముకున్నాడు.

సీసా జేబులోకి తోస్తూ మంచంమీదికి వంగేడు. తల్లి పక్కన పడుకున్న పసిపాప ముక్కుదగ్గర నిమిషం వరకూ వేళ్ళు ఉంచేడు...ఇహ వాడు ఏడుస్తాడనే భయం లేదు. గంటకిగానీ తిరిగి స్పృహరాదు!

మెల్లిగా వాణ్ణి ఎత్తుకుని వెనక్కి తిరిగేడు. ఆ తిరగడంలో కింద పడున్న ముసలమ్మకి కాలు తగిలింది. కలవరపడ్డాడు.

కళ్లు తెరిచి చూస్తోంది ముసల్ది!

అరవడానికి నోరు తెరిచింది కాబోలు. భయంతో అరుపు బైటికి రావడంలేదు. నోరు అలాగే తెరిచి గుడ్లప్పగించి చూస్తోంది!

“అరవకు! అరిస్తే పీక నొక్కి పారేస్తాను...” షణ్ముగం మాట ఇంకా పూర్తికాకముందే మంచం కిర్రుమన్న చప్పుడు.

అదిరిపడి మంచంవైపు చూసేడు.

కుర్రాడి తల్లి అటుతిరిగి పడుకుంటోంది!

షణ్ముగం గుండె కాస్త తెప్పరిల్లింది. “ఏయ్ ముసలీ! చెప్పేది నీకే! అరిచి గోలవేశావో, పుణ్యానికి ప్రాణాలు పోతాయ్! కిక్కురుమనకుండా అలాగే పడుకో” అంటూ గబగబ గదిలోంచి బైటికి నడిచేడు.

బైటికి రాగానే కాలి సత్తువకొద్దీ పరుగు లంకించేడు. అప్పుడు ప్రారంభమయ్యేయి ఇంట్లో కేకలు. ముసల్ది గొంతు చించుకుని గావుకేకలు పెడుతోంది.

"ఇన్‌స్పెక్టర్ గారు ఉన్నారా?"

"ఉన్నారు!"

"వారితో అర్జంటుగా మాట్లాడాలి."

"మీ పేరు?"

"శివరాం!"

సార్జంట్ డేవిడ్ లోనికెళ్ళి, రెండు నిమిషాల తరవాత తిరిగివచ్చి—

"రండి" అన్నాడు.

శివరాం కాళ్ళీడ్చుకుంటూ ఇన్‌స్పెక్టర్ ఆఫీస్‌రూం లోకి నడిచేడు. అతని మొహం పీక్కుపోయి వుంది. జుత్తు అస్తవ్యస్తంగా పడుంది.

"ప్లీజ్, టేక్ యువర్ సీట్!" అన్నాడు ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి.

శివరాం నీరసంగా కుర్చీలో జారగిలబడి "ఇన్‌స్పెక్టర్ గారూ! రాత్రి మా బాబుని ఎవ్వరో ఎత్తుకుపోయేరు" అన్నాడు జీరబోయిన కంఠంతో.

సార్జంట్, ఇన్‌స్పెక్టర్ ఇద్దరూ ఉలిక్కిపడ్డారు.

"ఏం జరిగిందో వివరంగా చెప్పండి!" అన్నాడు రాజారెడ్డి ఆత్రుతగా.

రాత్రి తనింటికి సి.ఐ.డి. ఇన్‌స్పెక్టర్నని ఓ వ్యక్తి రావడం, తనని మూర్ఛ పోగొట్టడంవరకూ చెప్పి—

"మళ్ళీ నాకు స్పృహవచ్చి చూస్తే నా భార్యా, అమ్మా గుండెలు బాదుకుంటూ ఏడుస్తున్నారు. వాళ్ళ అరుపులు విని అప్పటికే ఇరుగుపొరుగు ఇళ్ళవాళ్ళు గుమిగూడి ఉన్నారు. ఏం జరిగిందని అడిగేను ఖంగారుగా.

బాబుని ఎవడో దొంగ ఎత్తుకుపోయేడని చెప్పేరు. నా గుండె ఆగిపోయినంత పనయింది. అర్థరాత్రి ఇన్‌స్పెక్టర్నని ఇంట్లోకి వచ్చి నన్ను స్పృహ పోగొట్టినవాడే ఆ దొంగయుంటాడని గ్రహించేను.

ఇంట్లో ఎక్కడి వస్తువులక్కడే ఉన్నాయి, ఒక్క బాబు తప్ప! దీన్నిబట్టి ఆ దొంగ బాబుకోసమే వచ్చాడని తెలుస్తోంది. ఆ ముక్కుపచ్చలారని పసికందుని వాడేం చేసుకుంటాడో ఎంతకీ అర్థంకావడంలేదు.

డబ్బుకోసం పిల్లల్ని ఎత్తుకుపోయి బ్లాక్ మెయిల్ చేస్తారని విన్నాను. నేను గుమాస్తాగిరీచేసుకు బ్రతికే మధ్యతరగతి బడుగుజీవిని. నా దగ్గిరేముందని?

ఇన్‌స్పెక్టర్ గారూ! ఇదివరకే నా భార్యకి రెండు కడుపులు పోయి, ఎన్నో మందులూ, మొక్కులూ, నోములూ నోచేక ఈ కుర్రాడు పుట్టేడు. ఎలాగైనాసరే, మీరు నా బాబుని రక్షించాలి!'' అతని కళ్ళలో నీటి పొర.

ఇన్‌స్పెక్టర్ వివరాలు రాసుకుని ''ఇక మీరు వెళ్ళండి. నిర్భయంగా ఉండండి! మీవాళ్ళకి కూడా ధైర్యం చెప్పాలి. మీ బాబు ఎక్కడున్నాసరే వెతికి మీ కప్పగిస్తాను,'' అన్నాడు.

అలా అన్నాడేకాని, ఈ జన్మలో ఆ పసివాణ్ణి సజీవంగా కనిపెట్టగలననే నమ్మకంలేదు ఇన్‌స్పెక్టర్‌కి.

శివరాం లేచి, నమస్కారంపెట్టి వెళ్ళిపోయేడు.

''సార్జంట్!''

''యస్ సార్!''

''అతన్ని వెంబడిస్తూ వెళ్ళి, ఇంటికి కొద్దిదూరంలో

పోస్ట్ మెన్ కోసం ఎదురుచూస్తుండు. అతను రాగానే ఏదో ఒక సాకుతో ఇక్కడికి తీసుకురా!'' అన్నాడు ఇన్ స్పెక్టర్.

డేవిడ్ తలూపి బైటికి నడిచేడు.

ఇన్ స్పెక్టర్ ఆలోచనలు తీవ్రరూపం దాల్చేయి. సిగరెట్ మీద సిగరెట్ అంటిస్తూ కేసును కూలంకషంగా పరిశీలిస్తున్నాడు.

పన్నెండు గంటల ప్రాంతంలో డేవిడ్ తిరిగివచ్చేడు. ''మీ ఊహ కరెక్టే సార్! పోస్ట్ మెన్ పార్సిల్ తో శివరాం ఇంటికి వెళ్ళబోతుండగా ఆపి, పిలుచుకొచ్చేను'' అన్నాడు.

''తీసుకురా లోనికి!''

డేవిడ్ వెళ్ళి పోస్ట్ మెన్ ని వెంటబెట్టుకొచ్చేడు.

అతని చేతిలోని పార్సిల్ అందుకుంటూ-''దీన్ని మేము తీసుకుంటున్నాం!'' అన్నాడు ఇన్ స్పెక్టర్ రాజారెడ్డి.

''అదేమిటి సార్?'' పోస్ట్ మెన్ కళ్ళు ఆశ్చర్యంతో విప్పారేయి.

''భయపడక! ఈ పార్సిల్ మేము తీసుకున్నట్టు మీ అధికార్లకి తెలీజేస్తాం! ఇందులో దొంగసొమ్ముంది. ఇక నువ్ వెళ్ళు!''

ఆ పార్సిల్ ని ఇన్ స్పెక్టర్ రిసీవ్ చేసుకున్నట్టు రసీదు తీసుకుని వెళ్ళిపోయేడు పోస్ట్ మెన్.

చెక్కపెట్టెని అటూఇటూ తిప్పిచూసేడు రాజారెడ్డి. ఫ్రం అడ్రస్ లేదు! అది స్థానిక జనరల్ పోస్టాఫీస్ లో బుక్ చెయ్యబడింది. జేబులోంచి తాళం చెవులగుత్తితీసి, దానికి వేలాడుతున్న మడతకత్తి మొనతో పెట్టె మేకులు ఊడదీసి మూత తెరిచేడు.

శవం!

ప్రాణంలేని పసివాడి శవం!!

వెనకటిలాగే, గొంతుమీదా, చేతి మణికట్ల దగ్గిరా కత్తిగాట్లు. పాలగారితి బొమ్మలా తెల్లగా పాలిపోయి వుంది శవం.

పెట్టెమూల మడతపెట్టిన ఉత్తరం! చటుక్కున దాన్ని అందుకుని విప్పేడు ఇన్‌స్పెక్టర్.

'మిస్టర్ శివరామ్!

ఈశ్వరుని ఆజ్ఞలేనిదే చీమైనా చావదంటారు. నీ పిల్లాడికి ఈశ్వరుని ఆజ్ఞ అయింది వెళ్ళిపోయేడు. చింతించి ప్రయోజనం లేదు!

దృష్టికి కనిపించని ఒక సూక్ష్మజీవి ఇలా మానవాకృతి దాలుస్తుంది. కొన్నాళ్ళు జీవించి తరవాత మరణిస్తుంది. అంతే!'

ఎడంచేత్తో తెలుగులో గజిబిజిగా రాసిన ఉత్తరం అది.

పళ్ళు పటపట కొరికేడు ఇన్‌స్పెక్టర్.

పసివాడిని పాశవికంగా చంపుతున్న ఆవ్యక్తి మానవుడా? దానవుడా?

8

అతను పేపర్ విప్పి ఓచోట వేలితో చూపిస్తూ— "ఇక్కడ చూడు!" అన్నాడు.

షణ్ముగం దృష్టి అక్కడ నిలిచింది.

చిన్న కుర్రాడి ఫోటో అది! దబ్బపండులా ఆరోగ్యంగా ఉన్నాడు బోసిగా నవ్వుతున్నాడు.

"చూశావా?"

తలూపేసు షణ్ముగం. "వీడి ఫోటో పేపర్లో దేనికి వేసేరు?"

"చెబుతా విను! వారంరోజుల క్రితం వీడు, కూలికేసుకు బ్రతికే లేబర్‌కు పుట్టేడుట. మామూలు పిల్లలకన్నా రెండురెట్లు అధిక బలంతోనూ, ఆరోగ్యంగానూ పుట్టేడు. వీడి పాలఖర్చుకోసం ఆ కూలీకి ఆరోగ్యశాఖవారు గ్రాంటుకూడా మంజూరు చేసేరుట. అందుకే వేశారు ఫోటో."

సాలోచనగా తలూపేడు షణ్ముగం. "ఐతే ఏం చెయ్యాలి?"

"ఇంత ప్రత్యేకంగా దీనిగురించి చెబుతోంటే ఇంకా అర్థంకాలేదా? ఈ రాత్రి వీణ్ణి మాయంజేసి తీసుకురావాలి. వెయ్యి రూపాయలు అందుకోవాలి."

"ఆలోచించి చెబుతాను. ఓ సిగిరెట్ ఇలాపడెయ్!"

అతను నవ్వి సిగిరెట్ తీసిస్తూ - "చెప్పడానికాక్కాదు. ఎలా ఎత్తుకురావాలా అని ఆలోచించడానికి!"అన్నాడు.

సిగరెట్ అంటించి, గట్టిగా నాలుగైదు దమ్ములు లాగి- "సరే, అడ్రస్ చెప్పు!" అన్నాడు షణ్ముగం.

"వీడి తండ్రిపేరు వీరయ్య! వెస్టు మాంబళంలో ఓ పూరి గుడిసెలో నివసిస్తాడు!"

సిగిరెట్ ఇంకా సగం ఉండగానే ఏష్ట్రేలోనొక్కి లేచాడు షణ్ముగం. "రెండు గంటల్లో తిరిగొస్తాను" అంటూ చకచక బైటికి నడిచేడు.

9

"గణేశ్ బీడీ ఉందా?"

"ఇంకా స్టాక్ రాలేదు" చెప్పేడు కొట్టతను.

"ఐతే, టీ సోడా కొట్టివ్వు!"

నీళ్ళ తొట్టిలోంచి సోడా సీసా తీసి కొట్టిచ్చేసు కొట్టతను.

దాన్ని గడగడ ఖాళీచేసి—"చార్మినార్ సిగరెట్టుందా?" అడిగేడు షణ్ముగం.

"ఉంది."

"ఓ పాకెట్ ఇవ్వు!"

తీసిచ్చేడతను.

డబ్బు చెల్లించి వెనుదిరిగేడు షణ్ముగం. ఏదో జ్ఞాపకం వచ్చినట్లు ఆగి—"అన్నట్లు ఇక్కడ వీరయ్య అనే లేబర్ ఎక్కడుంటాడు? అర్జంటుగా కలవా లతన్ని!" అన్నాడు.

"వాడా! ఈ కుడివైపు మలుపు తిరగండి. కొద్ది దూరంలో గుడిసె కనిపిస్తుంది. అదే వాడి నివాసం!"

తలూపి వెనుదిరిగేడు షణ్ముగం.

మలుపు తిరిగి కొద్దిదూరం వెళ్ళగానే కనిపించింది పూరి గుడిసె. అక్కడ కూడా ఎలక్ట్రిక్ స్తంభాలు వున్నా, బల్బులు వెలగడం లేదు. తనకాక్కవలసింది కూడా అదే. పరిస్థితులు అనుకూలంగా వున్నాయి.

గబ గబ గుడిసెని సమీపించేడు. తడక తలుపు మూసి వుంది. ఒక్క తన్నుతో విరిగిపడుతుంది. తలుపుమీద చెయ్యి వేసేడు షణ్ముగం.

సరిగ్గా ఆ క్షణంలో వెనకనించి భుజంమీద బలమైన చెయ్యి పడింది! నెత్తిన పిడుగుపడ్డట్లు అదిరిపడి వెనుదిరిగేడు షణ్ముగం!

ఇన్స్పెక్టర్ రాజారెడ్డి!

సార్జంట్ డేవిడ్!!

షణ్ముగం గుండెలో గుర్రాలు దౌడుతీసేయి. రక్త ప్రసారం ఆగిపోయినట్టు తోచింది. కళ్ళు తేలిపోతున్నాయి.

సార్జంట్ చేతిలో టార్చి వెలిగింది.

"షణ్ముగం! నువ్వా?"

షణ్ముగం నాలిక పిడచగట్టుకుపోతోంది.

"ఇక్కడేం జేస్తున్నావ్?" అడిగేడు రాజారెడ్డి కఠినంగా.

షణ్ముగం నీళ్ళు నములుతూ "దొంగతనానికొచ్చేను" అన్నాడు.

"ఏం దొంగిలించడానికి? పిల్లాణ్ణా?"

"పిల్లల్ని దొంగిలించి నేనేం జేసుకోను?"

సార్జంట్ పకపక నవ్వేడు. "ఘరానా ఇళ్ళు దోపిడీ జేసే నువ్వు ఈ పూరిగుడిసెలో దొంగతనానికొచ్చావంటే నమ్మేదెవ్వడు? నిజం చెప్పు! పసివాళ్ళని మాయం చేస్తోంది నువ్వేకదూ?"

"అ...అబ్బె! నే... నేను కాదుసార్!"

"నీలాటి రౌడీలు మర్యాదగా అడిగితే చెప్పరు. ఎలా చెప్పించాలో నాకు తెలుసు!" అంటూ అడుగు ముందుకు వేసేడు ఇన్‌స్పెక్టర్.

"రాజారెడ్డిగారి సంగతి నీకు తెలుసుగా? ఒంట్లో ఎముకల్లేకుండా చితక తంతారు. పత్రికల్లో ఆ ప్రకటన వేయించింది మేమే! ఒళ్ళు హూనం కాకముందే బుద్ధిగా చెప్పెయ్!" అన్నాడు సార్జెంట్ డేవిడ్.

షణ్ముగం చేతులెత్తి "కొట్టకండి! చెబుతాను... అంతా చెప్పేస్తాను...అతని పేరేమిటో నాకు తెలీదు.

పిల్లాణ్ణి ఎత్తుకుపోయి ఇస్తే వెయ్యి రూపాయలిచ్చేవాడు. అందుకనీ..." అన్నాడు నీళ్ళు నముల్తూ.

"అతనెక్కడుంటాడో తెలుసుగా నీకు?"

"తెలుసు!"

వెనకనించి షణ్ముగం కాలర్ ఒడిసి పట్టుకుని "పద. చూపించు" అన్నాడు సార్జంట్, అతన్ని జీపువైపు తోస్తూ.

10

"ఇక్కడ ఆపండి!" అన్నాడు షణ్ముగం.

ఆ మేడముందు బ్రేక్ వేసేడు ఇన్‌స్పెక్టర్.

"ఇక్కడేనా వాడుండేది?"

సార్జంట్ వేసిన ప్రశ్నకి తలూపేడు షణ్ముగం.

జీప్ దిగి ముగ్గురూ కాంపౌండ్‌లోకి నడిచేరు.

తలుపు మూసి ఉంది. తోసేడు షణ్ముగం. కిర్రుమంటూ తెరుచుకుంది. ఇంట్లో సూది పడితే వినిపించే నిశ్శబ్దం!

డిటెక్టివ్ లిద్దర్నీ తన వెనక రమ్మన్నట్టు సైగచేసి మేడ మెట్లవైపు నడిచేడు షణ్ముగం.

ముగ్గురూ సవ్వడికాని అడుగులతో మెట్లెక్కి పైకి జేరుకున్నారు.

గది తలుపు తెరిచే ఉంది. లోపల డిమ్‌లైటు వెలుగుతోంది.

ఆ గదివైపు సైగచేసేడు షణ్ముగం.

ఇన్‌స్పెక్టర్ జేబులోంచి పిస్తోలు బైటికి తీసేడు. వాళ్ళనక్కడే ఉండమని సైగజేసి, ట్రిగ్గర్ మీద చూపుడు వేలు సిద్ధంగా ఉంచి, గదిలో అడుగుపెట్టేడు.

మసక వెలుతుర్లో గదిమధ్య కనిపించిన దృశ్యం ఇన్‌స్పెక్టర్ని దిగ్భ్రాంతుణ్ణి చేసింది. రెప్పవెయ్యడం మర్చిపోయేడు కాసేపు!

నేలమీద బోర్లా పడున్నాడతను. చేతులు రెండూ బార్లా చాచి ఉన్నాయి. కుడిచేతిలో రివాల్వర్! పక్కనే వెల్లికిలా పడుంది ఫెల్టు హాట్.

"పిచ్చివేషాలు వెయ్యక! లేచి నిల్చో!" అన్నాడు రాజారెడ్డి కటువుగా.

అతనిలో చలనం లేదు.

తమని బోల్తా కొట్టించడానికి ఇదో ఎత్తు కాదు కదా?

"ఏమాత్రం కదిలినా, కుక్కని కాల్చినట్టు కాల్చి పారేస్తాను!" అంటూ అతన్ని సమీపించేడు ఇన్‌స్పెక్టర్.

బూటుకాలితో బోర్లాపడున్న అతన్ని వెల్లికిలా తిప్పేడు.

అంతే! ఇన్‌స్పెక్టర్ గుండె ఝల్లుమంది!! అతని ముఖం వికృతంగా వుంది.

అతని కుడి కణతలో ఎర్రని రంధ్రం! ఆ రంధ్రం గుండా కారి, కింద మడుగుకట్టిన రక్తం!! కళ్ళు మూతలు పడుతున్నాయి. నోరు సగం తెరిచి ఉంది.

చటుక్కున వంగి అతని చెయ్యి అందుకున్నాడు ఇన్‌స్పెక్టర్. ఒళ్ళు చల్లబడుతోంది. ప్రాణంపోయి కొద్దిసేపే అయుంటుంది. ఆత్మహత్య చేసుకున్నాడా?

చుట్టూ కలయజూసేడు. టీపాయ్‌మీద ఏదో కాగితం రెపరెపలాడుతోంది. గబగబ అటు నడిచేడు.

అది ఉత్తరం! గాలికి ఎగిరిపోకుండా దానిమీద సిగరెట్ లైటర్ ఉంది. చటుక్కున ఉత్తరం అందుకున్నాడు ఇన్‌స్పెక్టర్.

గజిబిజిగా రాసిన అక్షరాలు. త్వరగా రాసినట్టు వుంది. "ఏదో ఒకరోజు నా పాపం పండక తప్పదని నాకు తెలుసు. పోలీసుల చేతిలో పడ్డాక ఎలాగూ ఉరికంబం ఎక్కక తప్పదు. ఆ అవస్థ పడేకంటే, నాకు నేనుగా చావడం మేలనిపించింది.

చచ్చేముందు నేనీ ఘాతుకాలకి ఎలా అలవాటు పడ్డానో చెప్పి చావడం న్యాయం!

రెండేళ్ళక్రితం, భారతదేశంనించి సిలోన్ వెళుతున్న బోయింగ్ విమానం ఘోర ప్రమాదానికిగురై సముద్రంలో కూలిపోయిన సంగతి బహుశా, మీకు తెలిసే వుంటుంది. ఆ విమాన ప్రయాణీకుల్లో నేనూ ఒకణ్ణి.

ఇంజన్ బ్రద్దలైంది. ఏ భాగానికిఆభాగం విడిపోతూ సముద్రంలో కూలిపోయింది విమానం. నాకు స్పృహవచ్చి చూస్తే స్పాంజి సీటుమీద బోర్లాపడుకుని తేలుతున్నాను. ఆ ప్రమాదంలో నా ముఖం విపరీతంగా కాలిపోయింది! సముద్రపు అలలు నేను పడుకున్న సీటును తోసుకుంటూ ఓ దీవికి చేర్చాయి. మనిషిమాత్రుడు లేని అతి చిన్న దీవి అది. ఆ దీవిలో నేను ఎన్ని అవస్థలుపడ్డానో వివరించే ఓపికా, సమయమూ ఇప్పుడు లేవు.

చుట్టూ మహాసాగరం ఉన్నా, తాగేనీరు లేకా, ఆకులూ అలములూ తింటూ ఎన్నో రోజులు ఏకాకిగా గడపవలసి వచ్చింది. అక్కడే ఒకరోజు ఓ విచిత్రమైన సంఘటన జరిగింది.

దీవిలో తిండి వెతుక్కుంటూ ఓ రాతి ప్రదేశం ఎక్కి జారిపడ్డాను. మొనదేలిన ఓ రాయి తగిలి బొటనవేలు తెగింది. రక్తం వరదలా కారసాగింది. అనుకోకుండా వేలు నోట్లో పెట్టుకున్నాను.

ఫుల్లఫుల్లని రక్తం నోరంతా ఊరసాగింది. ఆకలి దప్పికలతో అలమటిస్తున్న నాకు ఆ రక్తం అమృతంలా తోచింది. ఎంతోసేపు వేలు చీకుతూ రక్తం తాగేను. ఎంతో రుచిగా తోచింది.

ఆనాటినించీ నాలో రక్త పిపాస ప్రజ్వరిల్లింది. హ్యూమన్ సైకాలజీ దృష్ట్యా ఒంటరిగా జీవించే ప్రతి మనిషీ ఏదో ఒక దురలవాటుకు దాసుడౌతాడు.

మత్తుపదార్థాలకు అలవాటుపడ్డ మనుషులు సమయాని కవి దొరక్కుంటే పిచ్చెక్కినట్టు ప్రవర్తిస్తారు.

సరిగ్గా నా విషయంలోనూ అదే జరిగింది. కనిపించిన జంతువునల్లా చంపి నా రక్తదాహం తీర్చుకోసాగేను.

దాదాపు నలభై రోజులవరకూ అలా గడిపేక, ఒక రోజు మన దేశ వాణిజ్యనౌక ఒకటి ఆ దారమ్మట పోతూ నన్నాదుకుని, మద్రాసు జేర్చింది. అప్పటికే నా ఆరోగ్యం బాగా క్షీణించింది. చాలాకాలం హాస్పిటల్లో గడిపేను.

ఆక్కణ్ణించి విడుదలై రాగానే మళ్ళీ నన్ను ఒంటరితనం చుట్టుముట్టేసింది. సాటిమనుషులు నా వికృతరూపం చూసి దూరంగా పారిపోసాగేరు. స్నేహితులూ, బంధువులూ నన్ను వెలివేసేరు.

ఆ ఒంటరితనమే మళ్ళీ నాలో రక్తపిపాసను ప్రజ్వరిల్ల జేసింది. రుచికరమైన మానవరక్తంకోసం తహతహ

లాడసాగింది మనసు. బాగా ఎదిగిన మనిషి రక్తం కంటే అప్పుడే పుట్టిన పసిపాప తాజారక్తం చవిచూడాలన్న కొత్త ఆలోచన బీజం వేసుకుంది నాలో..."

అంతే ఉత్తరం ముగిసింది! ఇంట్లోకి వస్తున్న మమ్మల్ని చూసి ఆత్మహత్య చేసుకొని వుంటాడనుకొన్నాడు రాజా రెడ్డి.

వేడినిశ్వాస విడుస్తూ శవం వైపు చూసేడు, ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి.

-: ఐపోయింది :-